విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఐదేళ్ల పాటు భూమి లీజుకు చర్యలు

విశాలాంధ్ర - పి గన్నవరం : భూములను సర్వేచేసి నూతనంగా వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం భూమిలేని నిరు పేదలకు ప్రాధాన్యతనిస్తూ ఐదు సంవత్సరాల లీజుకు ఇచ్చేందుకై చర్యలు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన పి గన్నవరం మండలం నాగుల్లంక, ఉడిముడి లంక, గంటి పెదపూడి లంక, పి గన్నవరం లంక, బెల్లంపూడి లంక గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా మండల పరిధిలోని నాగుల్లంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి ఎలినేషన్ ద్వారా ప్రతిపాదించిన 46 సెంట్లు భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇటీవల కాలంలో లంక భూములను గుర్తించి రెవెన్యూ, నదుల సంరక్షణ అధికారి సమన్వయంతో భూమిలేని నిరుపేదలను ఎంపిక చేసి, కొత్త ఉత్తర్వులు ప్రకారం ఐదు సంవత్సరాలకు లీజుకై గుర్తించిన లంక భూములను ఉడిముడి లంక, గంటి పెదపూడి లంక, పి గన్నవరం లంక, బెల్లంపూడి లంకలో జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యటించి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏడాది పాటు మాత్రమే లీజుకిచ్చే వారని కొత్త ఉత్తర్వులు ప్రకారం ఐదు సంవత్స రాలకు లీజుకి ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యేడిద శ్రీనుకు మాతృ వియోగం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం జనసేన 3వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను తల్లి యేడిద రత్నకుమారి (67) బుధవారం చివరి శ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె అమలాపురంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. బీజేపీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పశు గణ అభివృద్ధి చైర్మన్ యాళ్ల దొరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, సీనియర్ నాయకుడు ఆర్వి నాయుడు, కొండేటి ఈశ్వర్ గౌడ్, బొంతు శివాజీ, అమలాపురం టౌన్ అధ్యక్షులు భాస్కర శాస్త్రి, బీజేపీ అమలాపురం పట్టణ ప్రధాన కార్యదర్శి అరిగెల తేజ వెంకటేష్, అమలాపురం రూరల్ మండలం ప్రెసిడెంట్ గుమ్మళ్ళ రెడ్డినాయుడు, అల్లవరం మండల ప్రెసిడెంట్ సుంకర సాయి సంతాపం వ్యక్తం చేశారు. యేడిద శ్రీనుకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : దాళ్వా సాగులో వినియోగించే యూరియా తదితర ఎరువులను నల్ల బజార్లో తరలించి అధికధరలకు విక్రయించినట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, షాపులను బ్లాక్ లిస్టులో పెట్టనున్నట్టు పెద్దాపురం ఏడిఏ (సహాయక వ్యవసాయ సంచాలకులు) ఎన్. దైవ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మండలంలోని ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొను గోలు చేసిన ఎరువులకు సంబంధించిన రసీదులను తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. షాపు యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయాలు కొనసాగించాలన్నారు. అధిక ధరలకు విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బి. జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

జిల్లా చేతివృత్తుల సంఘం కార్యవర్గ సభ్యునిగా గణేష్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమలాపురంకు చెందిన వాసంశెట్టి గణేష్ కుమార్‌ను జిల్లా చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ బలోపేతానికి, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై స్పందిస్తా నని తెలిపారు. గణేష్‌కు ఈ పదవి ఇవ్వడం పట్ల జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తికి, సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకర్, పాటి వెంకటరామయ్య, బొక్క రామకృష్ణ, బొంతు లక్ష్మణరావు, షేక్ కరిముల్లా బాబా, గిడ్ల సురేష్, సంఘ సభ్యులు హర్షం వ్యక్తపరిచారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన శ్రావణ్

విశాలాంధ్ర - సామర్లకోట : ఆలిండియా జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో సామర్లకోట పట్టణానికి చెందిన కేదార శెట్టి వెంకట సాయి శ్రావణ్ 97.73% మార్కులతో అఖిల భారత స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడం ఎంతో గర్వంగాను ఆనందంగానే ఉందని తల్లిదండ్రులు కేదారశెట్టి సూర్యనారాయణమూర్తి, దీప్తిలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేదారశెట్టి వెంకటసాయిశ్రావణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించడం జరిగిందని, ఇది నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విజయమని తెలిపాడు. తదుపరి జరగబోవు జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు సాధించి చెన్నై ఐఐటీలో కంప్యూటర్ కోర్సు చేయాలనేదే తన చిరకాల స్వప్నం అని వెంకటసాయిశ్రావణ్ తెలిపాడు. ఈ సందర్భంగా వెంకట సాయి శ్రావణ్‌ను పలువురు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధుల కేటాయింపు

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులను కేటాయిస్తున్నట్లు ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. ఈ మేరకు ముంగండ గ్రామంలో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పెచ్చెటి వెర్రియ్యా, మాజీ సర్పంచ్ నేలపూడి దుర్గారావు, మాజీ ఎంపిటిసి పిండి వరద రాజు, స్థానిక నాయకులు కుసుమ చిన్న, పితాని రాంబాబు, బొడ్డు సతీశ్, సరెళ్ళ గణపతి, నందెపు తాత, జల్లూరి గుప్త, భావన శ్రీను, పల్లయ్య పాల్గొన్నారు.

జాబ్ మేళా

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం,సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చేపడుతున్న "జాబ్ మేళా"లో భాగంగా ఈనెల 10వ తేదీన మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకు స్థానిక జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం వద్ద గల నేషనల్ అకాడమిక్ అఫ్ కన్స్ట్రక్షన్ నందు ఈ"మినీ జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. హరీష్ చంద్రప్రసాద్, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎమ్ పెరుమాళ్ళరావు, జేడిఎం కేశవ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు.ప్రముఖ బ్లూ ఓషీయన్ బయోటెక్, డి మార్ట్, మరియు మాక్స్ కంపెనీలు హాజరు కానున్నాయని, వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేసేందుకు పదవ తరగతి, ఇంటర్, ఆ పై చదువులు పూర్తి చేసిన 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.10,000 నుంచి రూ.15,000 వరకు కంపెనీలను బట్టి మంచి వేతనం ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు "9059641596". "6303889174", సంప్రదించాలని ఆ ప్రకటనలో వారు తెలిపారు.

586 ఎకరాలను నివాసయోగ్యంగా సిద్ధం చేయాలి

కలెక్టర్ కె. మాధవీలత

విశాలాంధ్ర - సీతానగరం/కోరుకొండ : 586 ఎకరాలను లబ్ధిదారులకు నివాసయోగ్యంగా సిద్ధం చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. బుధవారం కోరుకొండ మండలం కాపవరం, బూరుగుపూడి గ్రామాల పరిధిలో 25 వేల మంది లబ్ధిదారుల కోసం ఇళ్ళ స్థలాలు పంపిణీకి గుర్తించిన 586 ఎకరాల భూమిని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ దినేష్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ మాదవి లత పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ, ప్రతి ఒక్క పేద వానికి సొంత ఇంటి కల సాకారం చేయవలసిన బృహత్తరమైన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఇప్పటికే నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ కార్యక్రమంలో భాగంగా స్థలాలు ఇస్తున్నామని తెలిపారు. బూరుగుపూడి, కాపవరం గ్రామాల్లో గుర్తించిన ప్లాట్స్ ను రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కోరుకొండ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. లే అవుట్‌ల అభివృద్ధి, స్థలాలు కేటాయింపులు తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో వచ్చే కాలనీకి చెందిన రహదారి, త్రాగు నీటి వ్యవస్థ, మెరక పనులు చేయడం క్షేత్ర స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ చైత్ర వర్షిణి, కోరుకొండ మండల తహశీల్దార్ పి పాపారావు, ఇరిగేషన్ ఏఈ శివ ప్రసాద్, ఇతర మండల అధికారులు, సర్వేయర్లు, బురుగుపూడి, కాపవరం సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిఈఓ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - తాళ్ళపూడి: దివ్యాంగ చిన్నారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు వారికి చదువు చెప్పేందుకు భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం పేర్కొన్నారు. తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం ఎంపీ జెబి స్కూల్ లో నిర్వహిస్తోన్న భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మండల విద్యా శాఖాధికారి వివేకానంద తదితర అధికార బృందం డి.ఈ.ఓ తో పాటు హాజరయ్యారు. భవిత కేంద్రానికి వచ్చే పిల్లలు సంఖ్య పెరిగే విధంగా చూడాలని, ఉపాధ్యాయురాలు బలగం విశాలక్ష్మి కి తగిన సూచనలు చేశారు. దివ్యాగులకు ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని తల్లిదండ్రులు కు తెలియ జెప్పాలని సూచించారు. దివ్యాంగ చిన్నారులు తో మాట్లాడారు. భవిత సెంటర్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన ఆదర్ష్ కళాశాల విద్యార్థి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదర్ష్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి. రోహిత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించాడు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జైపూర్ విశ్వవిద్యాల యంలో జరిగిన 5వ జాతీయ స్థాయి స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ కబడ్డీ పోటీల్లో అండర్ 17విభాగంలో తృతీయ స్థానం సాధించి బ్రౌంజ్ మెడల్ సాధించడం జరిగిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల నందు రోహిత్‌ను కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, ప్రిన్సిపాల్ వైవిఎన్ రాజశేఖర్, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆశక్తి పెంచుకోవాలని సూచించారు.

పంట పొలాలను పరిశీలించిన ఆర్డీవో

విశాలాంధ్ర - కరప : మండలంలో సాగునీరు లభ్యత తక్కువగా ఉండటంతో కాకినాడ ఆర్డిఓ బివి రమణ పంట పొలాలను పరిశీలిం చారు. బుధవారం అరట్లకట్ట గ్రామంలో సాగునీటి ఎద్దడితో సాగు సమస్య ఎదుర్కొంటున్న పొలాలను రెవెన్యూ వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బివి రమణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాలలో పర్యటించి సాగు సమస్యకు అధిగమించవలసిన చర్యలపై మండలాధికారులతో చర్చించినట్టు తెలిపారు. ముఖ్యంగా సాగునీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మూడంచల విధానంలో కాకుండా అయిదించల విధానంలో సాగునీరు సరఫరా చేయాలని. ముఖ్యంగా సాగునీటి ఎద్దడి వల్ల మండల పరిధిలో సుమారు 200 ఎకరాలలో సమస్య ఉన్నదని వ్యవసాయ అధికారులు ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమస్యలపై ఆర్డీవో స్పందిస్తూ తక్షణం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సాగు సమస్యకు పరిష్కారం చూపుతాననితెలిపారు. ఈ ఆర్డీవో వెంట తహశిల్దార్ పి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి రాజేష్, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రమణ్యం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాచరరావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులతో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండ

విశాలాంధ్ర - అలమూరు : విపత్తుల వల్ల సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సహాయం అందించి అండగా ఉంటామని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ కేఎస్ నారాయణ (ఢిల్లీ నారా యణ) అన్నారు. కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన గళ్ళా నాగ వరలక్ష్మి, దేవరప్లడి సత్యవతులకు చెందిన ఇల్లు ఇటీవల పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో ఉండడంతో ఇటీవల మీడియాలో వచ్చిన వరుస కథనాలతో అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, డిఆర్ఓ ఆదేశాల మేరకు కొత్తపేట ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి విజ్ఞప్తి మేరకు బుధవారం బాధిత కుటుంబాలకు నూతన వస్త్రాలు, నిత్యవసర వస్తువులు, బియ్యం, వంట సామాగ్రి, టెంట్లను మండల వైకాపా కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు లక్ష్మీ మౌనిక చిన్న, పడమటి రాంబాబు, యు సుందర్ విజయం చేతులమీదుగా బాధ్యత కుటుంబాలకు అందజేశారు. సర్వం కోల్పోయి కష్ట కాలంలో ఉన్న బాధ్యత కుటుంబాలను ఆదుకోటమే నిజమైన మానవత్వం అని వీరు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ ఎం. ప్రసాద్, ఎం. శేఖర్, నాయకులు దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, మోటూరి సురేష్, గ్రామ వీఆర్ఓ ప్రకాష్, వీఆర్ఏ రాజు పలువురు పాల్గొన్నారు.

విదేశీ విద్య పథకాన్ని సరళతరం చేయాలి

విశాలాంధ్ర - రావులపాలెం : విదేశీ విద్య పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని టీడీపీ నాయకులు ఆరోపించారు. విదేశీ విద్య పథకంలో క్యూఎస్ 200 పేరుతో పథకం లబ్ధిదారులను కుదించడం తగదని, గత ప్రభుత్వం మాదిరిగా నిబంధనలను సరళతరం చేయాలని కోరుతూ బుధవారం రావులపాలెం మండల టీడీపీ నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. తొలుత స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్ర పటానికి వినతి పత్రం సమర్పించి వినూత్న నిరసన తెలిపారు . ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, కేతా శ్రీనివాసరావు, సయ్యపరాజు రామకృష్ణంరాజు, మేడపాటి కాసురెడ్డి, జక్కంపూడి వెంకటస్వామి, మాసాబత్తుల ఆనందరావు, పెచ్చెట్టి చిన్నారావు, ముత్యాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు తక్షణం స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం పట్టణంలో కల్లుగీత కార్మికులకు 500 నుంచి వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కల్లు కాంపౌండ్‌కి కేటాయించకపోతే ఉద్యమం తప్పదని శెట్టిబలిజ, గౌడ సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ రోడ్‌లో ఉన్న శెట్టిబలిజ, గౌడ సంఘం నాయకుడు కడలి వెంకటేశ్వరరావు నివాసం వద్ద రాజమండ్రి నగర కల్లుగీత కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడలి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కల్లు గీత కార్మికులు కుల వృత్తి చేసుకునేందుకు అవకాశం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. పేద కల్లు గీత కార్మికులకు 500 నుంచి వెయ్యి చదరపు గజాల స్థలం కేటాయించాలని చాలా రోజుల నుంచి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణం కల్లుగీత కార్మికులకు స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టకపోతే శెట్టిబలిజ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేస్తామని కడలి స్పష్టం చేశారు. పలువురు కల్లుగీత కార్మికులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తమ కులవృత్తే జీవనాధారంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని ఎక్కడా తమకు స్థలం కేటాయించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. శెట్టిబలిజ, గౌడ సంఘం నాయకులు సూరంపూడి శ్రీహరి, గుత్తుల రామచంద్రరావు, మట్టా సత్తిబాబు, రేలంగి రామకృష్ణ, సిహెచ్ కొండబాబు, గ్రూప్ అధ్యక్షుడు గుత్తుల దుర్గారావు, ఉపాధ్యక్షుడు మట్టా శేషు, సెక్రటరీ మట్టా శ్రీనివాసరావు, డైరెక్టర్లు కట్టా శ్రీను, బొక్క శ్రీను, మట్టా విష్ణు, మట్టా సూరిబాబు, గ్రూప్-2 అధ్యక్షుడు రేలంగి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు ఈలి రామారావు, లాలాచెరువు అధ్యక్షుడు టేకుమూడి సర్పయ్య, వంక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో గడపగడపకు మనప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ 24వ డివిజన్‌లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిం చారు. అన్నమ్మ ఘాటీ సెంటర్ సమీపంలోని అంబే ద్కర్ విగ్రహం ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కౌడ చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి కుమార్, వైయస్సార్సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, కమిషనర్ కే రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు వీరి వెంట ఉన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళపాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన పట్ల ప్రజల్లో పూర్తి సంతృప్తి కనిపిస్తోందన్నారు. ప్రతి గడపలోనూ నవరత్న పథకాల లబ్దిదారులు ఉన్నారని, ప్రభుత్వ పారదర్శక పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, డిఈ మాధవి, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్‌లు నల్లబిల్లి సుజాత, కర్రిశైలజ, నగర బిసి సెల్ అధ్యక్షుడు పేర్ల రజిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెడికల్ బెడ్

విశాలాంధ్ర - అనపర్తి : కుతుకులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు రూ.45 వేలు విలువ చేసే మెడికల్ బెడ్ పడాల దేవా రెడ్డి జ్ఞాపకార్థం కుమారులు సొసైటీ అధ్యక్షులు పడాల వెంకటరెడ్డి (పెదకాపు), సత్యనారాయణ రెడ్డి, దుర్గారెడ్డి సమకూర్చారు. బుధవారం వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నల్లమిల్లి దుర్గా వరప్రసాద్ రెడ్డి (ఎన్ డి ఆర్) చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు పులగం వీర వెంకట సత్యనారాయణ రెడ్డి, హై స్కూల్ కోఆప్షన్ సభ్యులు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి (దొరబాబు), వైద్యులు చాందిని కుమార్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటో తేదీన పెన్షన్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం దేవరపల్లి మండల రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో పప్పు వెంకట రామారావు అధ్యక్షతన జరిగింది. కార్యదర్శి బండి సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్లు ఇచ్చేటట్టు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఒకటి జూలై 20 18 తరువాత పదవి విరమణ చేసిన ఉద్యోగుల పిఆర్సి ఏరియర్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ గడువును మార్చినెలాఖరు వరకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సీతారామయ్య అసోసియేట్ అధ్యక్షులు సయ్యద్ అలీ ఉపాధ్యక్షులు తలారి ఏసుదాసు జాయింట్ సెక్రెటరీ నాగేశ్వరరావు మండలంలో సీనియర్ పెన్షనర్ వెలిచెర్ల సూర్యనారాయణ మూర్తి మరియు ఈసీ మెంబర్ సుగుణలత పాల్గొన్నారు. సీనియర్ పెన్షనర్ వెంచర్ల సూర్యనారాయణ మూర్తి 86వ పుట్టినరోజు ను మండల శాఖ ఘనంగా జరిపింది.

పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ ధోరణి విడనాడాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

విశాలాంధ్ర- రాజమండ్రి: రాజమండ్రి పేపర్ మిల్ యాజమాన్యం అత్యంత నిరంకుశంగా, చట్ట వ్యతి రేకంగా వ్యవహరిస్తున్నదని దీనిపై అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్ర నాథ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పేపర్ మిల్ 8 కార్మిక సంఘాలు 29 రోజులు గా చేస్తున్న నిరాహార దీక్షను సందర్శించి కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికుల కడుపుకొట్టే, కొంతమంది జేబులు నింపుకుంటున్న వరంపర 2 ఆపాలని అన్నారు. పెండింగ్ లో వేతన ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. అలవెన్సు పాత పద్ధతి ప్రకారం ఇవ్వాల, యూనియన్ నాయకులపై కక్ష సాధింపు ధోరణి ఆపాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా నేతలు తాటిపాక మధు, కుంద్రపు రాంబాబు, వి. కొండలరావు, ఏఐ వై ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎం ఎస్ రాజు, పేపర్ మిల్ నాయకులు జీఏ రామారావు, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు జరగాలి

విశాలాంధ్ర - సీతానగరం : ఉగాదికి సాధ్యమైనన్ని ఇళ్ల గృహప్రవేశాలు జరగాలని ఎంపిడివో కె.రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో కె. రమేష్, హౌసింగ్ ఏఈ రామారావు సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కొలనీలలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఉగాదికి రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల ఇళ్లు గృహ ప్రవేశాలు జరగాలని ఆదేశించారు. దానిలో భాగంగా సీతానగరం మండల వ్యాప్తంగా 180 ఇళ్లు గృహ ప్రవేశాలు సిద్ధం చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దానికి అనుగుణంగా ఇళ్ల లబ్దిదారులను ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.బి.బాగ్చి ఆదేశాల మేరకు ఎస్.పి. పి.వి.రవి కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి రాజమహేంద్రవరం యూనిట్ పరిధిలోని తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్ మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధవళేశ్వరం, కాకినాడ జిల్లాలోని జగ్గంపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కాట్రవులపల్లిని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డి.కేశవరంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయములు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, సదరు ఆరోగ్య కేంద్రములలో గల మౌలిక వసతులు, త్రాగు నీటి లభ్యత, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత మొదలగు అంశములపై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించబోతున్నట్లు ఎస్.పి. తెలియచేశారు. ఈ తనిఖిలలో డి.ఎస్.పి పి.ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తహశీల్దార్ విజయ కుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ మరియు హెడ్ కానిస్టేబుల్ జీవానందం , కానిస్టేబుల్స్ లోవకుమార్, ఈశ్వర్, వలీ, వీరబాబులు పాల్గొన్నారు.

జీతాలు వెయ్యండి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ఉద్యోగులంటేనే కచ్చితమైన ప్రణాళిక లు వేసుకొని, జీతం తో జీవితాన్ని గడిపే జీవులు. జగనన్న ప్రభుత్వం లో ఈ నెల 8 వ తేదీ వచ్చినప్పటికీ ఇంకా 20 శాఖలలో జీతాలు రాక, ఈ.ఎమ్.ఐ లు కట్టలేక, రెంట్ లు, పిల్లల ఫీజులు, సామాన్య ఖర్చులు చెల్లించుకోలేని పరిస్థితి ఉద్యోగులకు ఏర్పడిందని గోపాలపురం తాలూకా జె.ఏ.సి చైర్మన్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వర రావు అన్నారు.

ప్రతీ నెలా 5 వ తేదీ కి వచ్చే జీతం ఈ నెల ఇంకా రాలేక పోవడం వలన ఉపాధ్యాయ, ఉద్యోగుల బ్యాంకు చెక్ లు బౌన్స్ అవుతున్నాయని అన్నారు. వెంటనే దీని పై సత్వర చర్యలు చేపట్టాలని, జీతాలు 1వ తేదీనే ఇచ్చే చట్టం అమలు చేయాలని అన్నారు. ఇప్పటికే యాప్ ల కష్టాలు, హాజరు కష్టాలు, ఆ పై సకాలంలో జీతాలు రాని పరిస్థితి అన్నీ ఒకే సారి ఉపాధ్యాయ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. తక్షణమే అన్ని సమస్యలను పరిష్కరించాలని జోడాల కోరారు.

మహారాజశ్రీ విజయవాడ నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No: 177/2022 in R.C.C.No : 19/2019
Between :
1) Meharajunnisa (died)
2) Mohammad Zuber Abdul Rahaman
3) Smt. Sareen Sulthana
4) Smt. Mohammad gousiya Begum
5) Smt. Shaik Siddiqua Begum
- Petitioners/Proposed/ Defadants /LR.s of D1
And
Mohammad Yusuf & 2 Others
- Respondents
To
R-3 : Smt. Taslim Sulthana W/o. M.A. Kaddar D.No: 11-1-20/2, 1st line Ismail Nagar, Samarlakota, East godavari District
పిటిషనర్ రెస్పాండెంట్-3 అయిన మీ మీద పై నెంబరు పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున రెస్పాండెంట్-3 అయిన మీరు ది.23-02-2023న ఉదయం 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీకోర్టు వారిచే మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచటమైనది.
వాయిదా తేది : 23-02-2023
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)
M.S.KHALID B.COM, B.L
Advocate
54-18-39, Road No : 1,
Radio Colony, ITI College Road,
Vijayawada - 520008
Cell No : 9392111319

మహారాజశ్రీ విజయవాడ నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No: 178/2022 in I.A.No: 19/2021 in R.C.C.No : 19/2019
Between :
1) Meharajunnisa (died)
2) Mohammad Zuber Abdul Rahaman
3) Smt. Sareen Sulthana
4) Smt. Mohammad gousiya Begum
5) Smt. Shaik Siddiqua Begum
- Petitioners/Proposed/ Defadants /LR.s of D1
And
Mohammad Yusuf & 2 Others
- Respondents
To
R-3 : Smt. Taslim Sulthana W/o. M.A. Kaddar D.No: 11-1-20/2, 1st line Ismail Nagar, Samarlakota, East godavari District
పిటిషనర్ రెస్పాండెంట్ -3 అయిన మీ మీద పై నెంబరు పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున రెస్పాండెంట్-3 అయిన మీరు ది.23-02-2023న ఉదయం 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచటమైనది.
వాయిదా తేది : 23-02-2023
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)
M.S.KHALID B.COM, B.L
Advocate
54-18-39, Road No : 1,
Radio Colony, ITI College Road,
Vijayawada - 520008
Cell No : 9392111319

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర -ముసునూరు: మధ్యాహ్న భోజనం కార్మికుల బిల్లులు చెల్లించలే దంటూ ముసునూరు మండల మధ్యాహ్న భోజనం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 2019 వ సంవత్సరం నుండి అధికారంలోకి వచ్చిన ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరుముద్ద పేరుతో మధ్యాహ్నభోజనంలో మోనూ మార్చడమే తప్ప,వారి బిల్లులు మాత్రం ఇవ్వడంలేదని సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లిపాము భవాని,దొంతు కోటయ్య, బాలమ్మ, దాడిచర్ల నాగరత్నం, తిరుపతయ్య, సయ్యద్ ముంతాజ్‌బేగం, సత్యవతి ,చెంగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దాసాంజనేయ స్వామికి 18న విశేష అభిషేకాలు

విశాలాంధ్ర - పాలకొల్లు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకుని పాలకొల్లు కెనాల్ రోడ్ లో వేంచేసి ఉన్న రుద్రాక్ష సంభూత శ్రీ దాసాంజనేయ స్వామి వారికి, ఈ నెల 18వ తేదీ, స్థిర వారం ఉదయం గం. 10:50గంటల నుండి 12:30 వరకు భక్తుల గోత్రనామాలతో మూలమూర్తికి ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహించే ఏకాదశ మన్యుసూక్త నమకం, చమకం, నవగ్రహ మంత్రాలతో వేద మంత్రాలతో, 18 రకముల ద్రవ్యములతో, సప్త వర్ణములతో కనుల పండుగగా ఏకా దశ హారతులతో స్వామివారికి విశేష అభిషేకములు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీ చైతన్యలో సి బ్యాచ్ అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక బాలాజీ నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో సి బ్యాచ్ అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీ చైతన్య పాఠశాల జోనల్ కోఆర్డినేటర్ ఉదయభాస్కర్ సి బ్యాచ్ పట్ల అవగాహన కల్పించారు. నేటి పోటీ కాలంలో పాఠశాల స్థాయిలో నూతన విద్య, విద్యా విలువలు మెరుగుపరుచుకునేందుకు రాజమండ్రి, విజయవాడ లాంటి ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మన పరిసర ప్రాంతంలోని శ్రీ చైతన్య ఆధ్వర్యంలో సి బ్యాచ్ ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటి, నెట్ స్థాయిలో విద్యలను అందించేందుకు సి బ్యాచ్ పాఠశాల స్థాయి నుండి ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. మెరుగైన విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులకు వారి సందేహాలను సైతం నివృత్తి చేశారు.

రఘురాంను పరామర్శించిన ఎమ్మెల్యే గ్రంది

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ముఖ్యమంత్రి జగన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎం ఎల్ సి తలశిల రఘురాంను భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ బుధవారం విజయవాడలో గొల్లపూడి లోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రఘురాం సతీమణి స్వర్ణ కుమారి అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. కాగా ముందుగా స్వర్ణ కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దళితులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర-తణుకు: దళితులను ముఖ్యమంత్రి జగన్ మోసం చేస్తున్నారని టిడిపి ఎస్‌సి సెల్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చుక్కా సాయిబాబు విమర్శించారు. విదేశీ విద్య పథకంలో ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనార్టీ ,కాపు వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని నిరసిస్తూ టిడిపి నియోజకవర్గ నాయకులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు సాదే సామ్యూల్ రాజు, అబ్బ దాసరి లాజర్ నియోజవర్గ సెక్రటరీ కారెం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఐకమత్యంగా ఉందాం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గం పద్మశాలి, దేవాంగ, కర్ణ భక్తుల రాజకీయ చైతన్యం చేసేందుకు పార్టీలకు అతీతంగా రౌండ్ టేబుల్ సభ ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఉంగుటూరులో ఆ సంఘం ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దొంతంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో 6500 మంది పైనే చేనేత కులస్తులు ఉన్నారని, చేనేత ఐక్యత కోసం కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా మనమందరం ఐక్యమత్యంతో ఉండాలన్నారు. అందరిని ఏకం చేసేందుకు చేనేత సభ నిమిత్తం త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వానపల్లి నాగరాజు మాట్లాడుతూ చేనేత కార్మికులందరూ ఐక్యమత్యంగా ఉంటేనే మనం అన్ని విధాల అభివృద్ధి చెందుతా మన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకుడు, ఎంపీటీసీ సభ్యులు బందారు నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

భారీ ఎత్తున అన్న సమారాధన

విశాలాంధ్ర-ఉంగుటూరు: పెద్దింట్లమ్మ ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఉంగుటూరు మండలం చేబ్రోలు నూతల చెరువు వద్ద ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారికి చేబ్రోలు గ్రామ సర్పంచి లక్ష్మీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు బందారు నాగరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ ఇంచార్జ్ పత్స మట్ల ధర్మరాజు , ప్రజా ప్రతినిధులు కార్యదర్శుల పెద్దింటమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం

విశాలాంధ్ర-టి నరసాపురం: ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పేద విద్యార్థులకు విదేశీ విద్యను దూరం చేస్తున్నారని టిడిపి బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండపల్లిరవి ఆరోపించారు. పార్టీ అదేశాల మేరకు పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం చేయడాన్ని నిరసిస్తూ మండల తెలుగుదేశం పార్టీ, బిసి సెల్ అధ్వర్యంలో టి నరసాపురం ప్రధాన సెంటర్ లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సంపన్న వర్గాలతో సమానంగా బడుగుబలహీన వర్గాలకు 4923 మందికి 364 కోట్ల రూపాయలతో విదేశీ విద్యను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి , పాపాచార్యుల వీరేశలింగం, సిద్దా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ జేవీ మురళి

విశాలాంధ్ర-పాలకోడేరు: రీసర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసి మంచి ఫలితాలు సాంధించాలని జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి అన్నారు.బుధవారం పాలకోడేరు రీ సర్వే పనులను జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ భీమవరం డివిజన్ లో 28 గ్రామాలు రీ సర్వే అయ్యాయని, మిగిలిన 100 గ్రామాలు ఫిబ్రవరి నెల ఆఖరున పూర్తి చేయాలని సర్వే అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు. రీ సర్వే లో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్లను కచ్చితంగా గుర్తించి పనులు వేగవంతం చేయాల న్నారు. నరసాపురం డివిజన్లో గల గ్రామాలను ఈ సర్వేలో భాగంగా డ్రోన్ ఫ్లే కార్యకలాపాలు చేయుటకు పైలెట్ ఏజెన్సీ ఏ ఈ ఐ కు కేటాయించామని డ్రోన్ ఫ్లే చేయుటకు అధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ సర్వేలో భాగంగా ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయడం జరుగుతుందని ప్రతి రైతు జరాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా జాయింటు కలెక్టరు వెంట జిల్లా సర్వే అధికారి కె. జాషువా, డిప్యూటీ సర్వే అధికారి యస్. రాంబాబు, డి టి సూర్యనారాయణ, సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్ పైలెట్ వరప్రసాద్ రెడ్డి, కో.పైలెట్ దుర్గాప్రసాద్,సచివాలయ సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

11న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పర్యటన

విశాలాంధ్ర- భీమవరం : భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఈనెల 11వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనుటకు భీమవరం రానున్నారు. ఈనెల 11వ తేదీన ఉదయం గం.5.40లకు విజయవాడ రైల్వే స్టేషన్ నుండి నాగర్ సోల్ ఎక్స్ ప్రెస్ ట్రైన్‌లో బయలుదేరి ఉదయం గం.7. 19 లకు భీమవరం రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. అక్కడ నుండి విష్ణు కళాశాలలోని గెస్ట్ హౌస్ కు చేరుకుంటారు. ఉదయం గం.9.00లకు విష్ణు కళాశాల గెస్ట్ హౌస్ నుండి బయలుదేరి రాయలం , శివరావుపేట లో గల అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్దకు చేరుకొని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం 9. 50 నిమిషాలకు అక్కడనుండి బయలుదేరి 10 గంటలకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీర్ కళాశాలకు చేరుకుంటారు. 10 గంటల నుండి 12 గంటల వరకు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ లో నిర్వహించే ఫంక్షన్ కు హాజరవుతారు. మధ్యాహ్నం 12.00 గంటల కు ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి బయలుదేరి 12.10 గంటలకు విష్ణు కళాశాలలోని గెస్ట్ హౌస్ కి చేరుకుంటారు .అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3. 30 నిమిషాలను విష్ణు కళాశాల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 4.50 విష్ణు కళాశాల గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 5.00 గంటలకు భీమవరం రైల్వే స్టేషన్ కు చేరుకుంటారు. సాయంత్రం 5.15 నిమిషాలకు ట్రైన్ లో బయలుదేరి 7.30 నిమిషాల కు స్వర్ణ భారతి ట్రస్ట్ ఆత్కూరు చేరుకుంటారు.

జగనన్న విదేశీ విద్యా పథకంలో మోసం

విశాలాంధ్ర -భీమవరం: పేద విద్యార్థులకు విదేశీ విద్యా పథకం అందకుండా వైకాపా ప్రభుత్వం మోసం చేసిం దని పట్టుమని రెండొందల మంది విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తించక పోవడం శోచనీయమని టిడిపి విమర్శించింది. జగనన్న విదేశీ విద్య పథంకంలోని లొసుగులను నిరసిస్తూ బుధవారం టిడిపి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు పేద విద్యార్థులు 4,923 మందికి విదేశీ విద్యా పథకం ద్వారా ఒక్కొక్క విద్యార్థికి రూ 10 లక్షల చొప్పున రు 364.98 కోట్లు మొత్తం చెల్లించడం జరిగిందని ప్రస్తుత జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలుగా ఆపథకాన్ని పక్కనపెట్టి ప్రస్తుతం 213 మంది విద్యార్థులకు రూ19 కోట్లు చెల్లించి గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నదని విమర్శించారు. కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే విదేశీవిద్యా పథకాన్ని వర్తింపజేసి ఇచ్చిన రూపాయల కంటే 50 కోట్లు ప్రకటనలు ఇవ్వడాన్ని నాయకులు తప్పు పట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ వై.రవికుమార్ కు అందచేశారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి కన్వీనర్ వేండ్ర శ్రీనివాస్, భీమవరం నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాత సురేష్ బాబు, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, పంతం వెంకటసతీష్, దొంగ వెంకటేశ్వరరావు, అంగర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక వాయిదా

విశాలాంధ్ర -ఏలూరు : ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించదలచిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎపిఇపిడిసిఎల్ ఏలూరు ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టి. శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం తదుపరి తేదిని తెలియపరచడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా కోరారు.

పార్టీ కార్యాలయాలకు కుర్చీలు అందజేత

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని తొమ్మిది పంచాయతీలలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల నిర్వహణ కోసం ఆ పార్టీ పోలవరం నియోజకవర్గం అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి బుధవారం కుర్చీలు అందజేశారు. ప్రతి పంచాయతీలోని పార్టీ గ్రామ అధ్యక్షులకు ఐదు కుర్చీలు చొప్పున 45 కుర్చీలను నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ద్వారా ఇచ్చారు. అనంతరం కన్నాయిగుట్ట గ్రామంలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు దుకాణదారులు, ప్రజల వద్దకు వెళ్లి వైసిపి పాలనలో పెరిగిన ధరలు, పడుతున్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజా వ్యతిరేకంగా ముందుకు వెళ్తున్న జగన్ ప్రభుత్వ పాలనపై తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్, ప్రధాన కార్యదర్శి కట్టం రాంబాబు, మాజీ జడ్పీటిసి శాఖమూరి సంజీవులు, కరుటూరి రాధాకృష్ణ, కురిమెళ్ల సుధాకర్, నయిమ్, నఖిం, కుక్కునూరు రాంబాబు, పూనెం రామారావు పార్టీ గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

విశాలాంధ్ర- ముసునూరు: వేసవికాలంలో మంచినీటి కొరత లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో నూతన బోరు వేయించనున్నట్లు వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు.బుధవారం మండలంలోని లోపూడి గ్రామ పంచాయితీ శివారు బస్వావరప్పాడు గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా నూతన బోరు మోటారు ఏర్పాటు చేసి త్రాగు నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్ ,సర్పంచ్ పేరం కృష్ణ ,ఉపసర్పంచ్ మువ్వా బాబురావు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

అభిషేకం

విశాలాంధ్ర - కాకినాడ,తాళ్ళరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం ఇంజరం గ్రామంలో ప్రశిద్ధ శివాలయం శ్రీ ఉమాకృపేశ్వర దేవస్థానంలో కవల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాట్ల సుబ్బరాజు పుట్టినరోజు పురస్కరించుకుని 18 రకాల పండ్ల రసాలతో అభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో దాట్ల సుబ్బరాజు, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ధూళిపూడి వెంకటరమణ, వేగేశ్న భాస్కర రాజు, వుంగరాల వెంకటేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, ఆకెళ్ళ నాగేశ్వరావు, కాట్రు వీరేశ్వరరావు, రేలంగి శ్రీకాంత్, భైరవమూర్తి, అప్పారావు, నాని, అంజి, మహేంద్ర, శ్రీనురాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వర నీరాజనానికి ప్రేక్షకుల నీరాజనం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : స్థానిక విక్రమహాల్‌లో పట్నాల వెంకట సుబ్బమ్మ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పట్నాల శ్రీనివాస్ సారథ్యంలో యాంకర్,గాయకులు సింగర్ దీపిక అధ్వర్యంలో జరిగిన "మళ్ళీ మళ్ళీ పాడాలి" స్వర నీరాజనం సంగీత విభావరి అలరించింది. ముఖ్య అతిథులుగా హ్యూమన్ రైట్స్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పట్నాల శ్రీనివాస్,మాజీ కార్పొరేటర్ ఎ.వి రమణ,వంద పాటలు పాడిన బర్రె సుబ్రమణ్యం పాల్గొన్నారు. గాయకులు పట్నాల శ్రీనివాస్, దీపిక, ఆదర్శ, ఫణి కుమార్, రాధ, సుభాష్ లు ఆణిముత్యాల వంటి పలు పాత,కొత్త పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం అందిస్తున్న పట్నాల శ్రీనివాస్ అభినందనీయులని కొనియాడారు. కళాకారులకు దాతల సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్నాల శ్రీనివాస్,దీపిక ఆదర్శ్ దంపతులు,బర్రె సుబ్రమణ్యంలకు ప్రముఖులు చేతుల మీదుగా ఘనంగా సత్కారించారు.అనంతరం లక్కీ డీప్ ద్వారా ప్రేక్షకులకు పలు గిఫ్ట్ లు అందజేశారు. ఈకార్యక్రమంలో గాయకులు ఆదర్శ్, ఫణి కుమార్,ఆనంద్, గంగాధర్, ఈమని శైలజా, హేమాంబిక, రాధ,వీరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గరగనృత్యం కళాకారుడు లోవరాజుకు సన్మానం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల పరిధిలోని దొంతికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి మల్లాడి లోవరాజు గరగ నృత్యంలో ప్రతిభ కనపరుస్తున్నాడు. ఈ ఏడాది జనవరి 26 తేది రిపబ్లిక్ డే సందర్భంగా మన దేశరాజధాని న్యూ ఢిల్లీలో ప్రదర్శించిన ఆంధ్రప్రదేశ్ శకటము నందు గరగ నృత్య బృందంలో పాల్గొని తన ప్రతిభ కనబరిచాడు. ప్రతిభ కలిగిన కళాకారుడు మల్లాడి లోవ రాజును పాఠశాల అవరణలో బుధవారం ప్రధానోపాధ్యాయులు వై చంద్ర శేఖర్, స్టాఫ్ సెక్రటరీ బివి లక్ష్మన్ జీ, ఉపాధ్యాయులు డివి నారాయణ, వేణు గోపాల్, గోపాలకృష్ణ, వర్మ తదితరులు సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన సాయి మాధవి విద్యార్థులు

విశాలాంధ్ర - అనపర్తి : ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీ సాయి మాధవి డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారని ప్రిన్సిపల్ ఎన్. నవీన్ తెలిపారు. గురువారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో బి హరిణి 9.5, జి శివ బిందు 9.4, డి సరస్వతి 9.2, ఎల్ సువర్ణ 9.2, సిహెచ్ విజయలక్ష్మి 9.1 పాయింట్లు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా బీఎస్సీ, బికాం విభాగంలో 98.4, 97.8% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ నవీన్ చెప్పారు. ఈ సందర్భంగా ఎం ఎస్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లెడి అనంత సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సెమిస్టర్ లోను శ్రీ సాయి మాధవి కళాశాల విద్యార్థులు సాధించడం పట్ల అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.ఇంకా విద్యార్థులను సత్యభామ స్కూల్ డైరెక్టర్ ఎం మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి రామభద్రారెడ్డి (మల్లంపూడి), ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్ రెడ్డి, సత్యభామ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం పైడిరాజు తదితరులు అభినందించారు.

రామన్నపాలెంలో ఇదేం కర్మ

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామంలో బుధవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వ హించారు. గోపాలపురం నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు ఉండవల్లి దుర్గారావు పరిమి శ్రీ రామకృష్ణ దేవరపల్లి మండల టిడిపి అధ్యక్షులు ఆండ్రు అనిల్ కాట్రగడ్డ సోమరాజు, కాట్రగడ్డ రామ్మోహన్ గన్నమని హరికృష్ణ పెన్మెత్స సుబ్బరాజ కొటారు ద్రవ కాంత్ పాతూరి గిరిధర్ బొల్లిన భాస్కర్ యద్దనపూడి బ్రహ్మరాజు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం

- ఎజెండా ఊసే లేదు...?
- రాసింది ఒకటి చెప్పేది మరొకటి
-విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - చాట్రాయి : చాట్రాయి మండల పరిషత్తునిధులు ఏమవు తున్నాయి అంటూ విశాలాంధ్రలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం వైసీపీ నాయకత్వాన్ని ఓ కుదుపు కుదిపింది. గతంలో చాట్రాయి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు

చాట్రాయి పోలీస్ స్టేషన్లోనే నిరసన తెలియజేసే సందర్భంగా టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత కొడాలి నానిని ఎన్కౌంటర్ చేస్తాం అని ఆగ్రహంతో ఊగిపోతూ పోలీసులముందే ఉపన్యాసాలు చెప్పిన రోజు అదే వీడియో లు సోషల్ మీడియా లో పదే పదే చక్కర్లు కొట్టినా వైసీపీ నాయకత్వం ప్రేక్షకపాత్ర పోషించింది. నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జ్ అనేక సందర్భాలలో ఎంఎల్ ఎ ప్రతాప్ పై వ్యక్తి గతదూషణలకు పాల్పడిన సందర్భంలో నోరుమెదపలేదు. విశాలాంధ్ర కథనంపై ఆఘమేఘాల మీద ఎంపీటీసిలను ఆగ్రామాల పెత్తందారులను పిలిపించి విలేఖరుల సమావేశం నిర్వహించారు. విశాలాంధ్ర కథనంలో ముఖ్య మైన అంశం ఎజెండా కాపీలను ఇవ్వలేదనే విషయం అనేక మంది కొత్త ఎంపిటిసిలకు అస్సలు ఎజెండా అంటే 'మిటో కూడా తెలియకపోవడం గమనార్హం. అవినీతి జరిగిందని రాయకపోయినా అవినీతి గురించి రాసారంటూ కట్టుకథ అల్లారు. అవినీతి జరగలేదని కొంతమంది ఎంపీటీసీ లతో చెప్పించుకున్నారు. వాళ్ల పత్రికలలో ప్రచురించుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండల పరిపాలనలో కీలకమైన పాత్ర పోషించే వ్యక్తి ఎజెండా, లెక్కలు గురించి స్వయంగా చెప్పాల్సి ఉన్నప్పటికీ ఆ సమావేశంలో ఆయన లేకుండా సీనియర్ అసిస్టెంట్ తో లెక్కలు చెప్పించారు. వివరాలు అడిగిన విశాలాంధ్రకు నేటికీ ఎంపిడిఓ వివరాలు ఇవ్వనేలేదు. వాళ్లు నిర్వహించిన ఎంపీటీసీల సమావేశంలో కూడా పెత్తందారులదే ప్రధానోపాత్రగా ఉన్నట్టు విశ్వసనీయవర్గాల కథనం. కొంతమంది ఎంపీటీసీలు సమావేశం ఎందుకు పెట్టారో కూడా అర్థం కాక గందరగోళానికి గురైనట్లు తెలిసింది. రాజ్యాంగ బద్ధంగా నిబంధనల ప్రకారం జరగాల్సిన విషయాలుఎలా జరుగుతున్నాయి అని ప్రశ్నించిన విశాలాంధ్ర కు సమాధానమే చెప్పలేదు. కొబ్బరి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డికి అన్నచందంగావుందని పలువురు అంటున్నారు.

బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన వైకాపా ప్రభుత్వం

విశాలాంధ్ర - మామిడికుదురు : బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల జీవితాలను వైయస్సార్సీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మామిడికుదురు మండలం తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు చేపట్టిన నిరశన కార్యక్రమంలో ముందుగా స్థానిక సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, అంబెడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతరం మామిడికుదురు మండల తహశీల్దార్ సీఎచ్ నాగ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి గొల్లపల్లి, పి గన్నవరం నియోజకవర్గం ఇంఛార్జి గంటి హరీష్ మాధుర్‌లు మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ ప్రోత్సాహంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులతో పాటు, కాపు విద్యార్థులను ప్రోత్సహించి విదేశాలకు పంపిస్తే ఈ దుర్మార్గపు వైయస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశాలలో ఉన్న విద్యార్థులను మోసగించి వారికి ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలను నిలిపివేసి వారి జీవితాలను సర్వనాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ఈలి శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, అప్పారి వెంకటేశ్వరావు, ఉండ్రు శ్రీరామ్మూర్తి, చుట్టుగుళ్ల కిషోర్, మద్దాల నాగబాబు, కొమ్ముల నందు బాబు, యర్రంశెట్టి తాత బుజ్జి, సాపే కాశీ తదితరులు పాల్గొన్నారు.

అడ్డు అదుపు లేని ధరలు

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు నియోజక వర్గం, కొవ్వూరు టౌన్ లో 3వ వార్డులో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి కంటమణి రామకృష్ణ కొవ్వూరు టౌన్ అధ్యక్షులు దాయన రామకృష్ణ, టిడిపి నాయకులు సూరపనేని చిన్ని, క్లస్టర్ ఇంచార్జ్ పినుమాక జయరాజు టిడిపి నాయకులు జి జి చలం వేమగిరి వెంకట్రావు ,కుప్పాక జోహార్ 3 వ వార్డ్ కొల్లి రమేష్, కుక్కిరిపాటి వెంకటేష్, నూతంగి విజయ్ కుమార్, మరియు నాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేట జనసేనలో భారీ చేరికలు

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట మండలం సగరపేట గ్రామంలో జనసేన పార్టీ జగ్గంపేట మండల ప్రధాన కార్యదర్శి గండికోట వీరపాండు ఆధ్వర్యంలో పంచాయతీ వార్డు మెంబర్లు గాది పెద్ద అప్పన్న, గాది నాగరాజులతో పాటు సుమారు 100 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర జనసైనికులను, గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు వివరించారు. పవన్ కళ్యాణ్ నీతి, నిజాయితీలతో కూడుకున్న మంచి సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తి అన్నారు. ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించారు. నూతనంగా జనసేన పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సగరపేట గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండా స్థూపం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, సగరపేట గ్రామ ప్రజలు, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

దొంతికుర్రులో ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - కాట్రేనికోన : దొంతికుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో మర్లచెరువు, కోతులచెరువు గ్రామాలులో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుతం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, మండల సీనియర్ నాయకులు పల్లంకుర్రు ఇంచార్జ్ వెంట్రు సుధీర్, జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి విత్తనాల వెంకటరమణ, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కాశి నరేష్ బాబు, దొంతికుర్రు గ్రామకమిటీ అధ్యక్షులు యనమదల వెంకటరమణ, కడలి వెంకట సత్యనారాయణ, పెనుమల్ల గ్రామకమిటీ అధ్యక్షులు కొండేటి చినబాబు, గంగుమళ్ళ భద్రరావు, కాండ్రేగుల ప్రసాద్, మట్ట రమేష్, ఎలిపే వెంకటేశ్వరరావు, చెల్లి నడవపల్లి, గుబ్బల వెంకటసత్యనారాయణ, బొంతు నాగమునేశ్వరరావు, పెయ్యల రవికుమార్, అయితాబత్తుల బోసు, కాశి ప్రసాద్, కొప్పిశెట్టి రామకృష్ణ, తాడి బుల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.